# ధర అదిరే.. రైతు మురిసే!

- ఆశించిన స్థాయిలో దిగుబడులు, ధరలు
- ముమ్మరంగా సాగుతున్న కోతలు

గత పాలకులు వ్యవసాయాన్ని దండగా అనడంతో రైతు రైతుగా చెప్పుకునేందుకు నామోషి పడే వాడు. ఇరుగు పొరుగు వారిని అప్పు అడిగినా పలికేవారు కాదు. ఇంట్లో ఉన్న నగో, నట్రో, పొలం పాస్ పుస్తకాలో తీసుకెళ్లి బ్యాంకుల్లో తాకట్టు పెట్టి తెచ్చుకున్న సొమ్ముతో పంటలు సాగు చేసినా సరైన దిగుబడులు రాక.. వచ్చిన అరకొర దిగుబడులకు గిట్టుబాటు ధర లేక రైతన్న అప్పులపాలయ్యే వాడు. ఇదంతా గతం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వ్యవసాయం పండుగలా మారింది. సబ్సిడీ విత్తనాలు, పెట్టుబడికి ఆర్థిక సాయం, మందులు, ఎరువులు అందిస్తుండటంతో అన్నదాతకు సాగు పెద్దగా కష్టమనిపించడం లేదు. ఇక దిగుబడులు కూడా ఆశాజనకంగా రావడం.. ధర బాగానే ఉండటంతో ఇక తమ కష్టాలు తీరుతాయని అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– రుద్రవరం

మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో రైతులు ఖరీఫ్ సీజన్‌లో 7వేల హెక్టార్లలో వరి, నాలుగు వేల హెక్టార్లలో మొక్క జొన్న ప్రధాన పంటలుగా సాగయ్యాయి. వాతావరణం అనుకూలించడంతో ఒక్కో ఎకరాకు వరి 35 నుంచి 40 బస్తాల దిగుబడులు రాగా బస్తా(75కేజీలు) రూ.2,500 వరకు ధర పలుకుతోంది. మొక్క జొన్న 35 క్వింటాళ్లు దిగుబడి రాగా ఒక్కో క్వింటా ధర రూ.2,200లు పలుకుతోంది. రైతులు రెండో పంటగా తిరిగి ఖరీఫ్ సీజన్‌కు సమానంగా పంటలు సాగు చేశారు. వాటితో పాటు మండలంలోని ఎర్రగుడిదిన్నె, పేరూరు, చందలూరు, మందలూరు, చిలుకలూరు, ముత్తలూరు, నర్సాపురం, పెద్దకంబలూరు తదితర గ్రామాల పరిధిలో దాదాపు 1,500 ఎకరాల్లో జొన్న పంట సాగు చేశారు. తెగుళ్లు, విపత్కర పరిస్థితులు వంటివి ఏవీ లేకపోవడంతో పంట ఏపుగా పెరిగింది. ప్రస్తుతం ఆయా గ్రామాల పరిధిలో జొన్న కోతలు ముమ్మురంగా సాగుతున్నాయి. ఒక్కో ఎకరాకు 20 క్వింటాళ్ల దిగుబడులు వస్తున్నాయి. కూలీలతో కంకులు కోయించి యంత్రాల ద్వారా పంట నూర్పిడి చేయిస్తున్నారు.


ఎర్రగుడిదిన్నె వద్ద జొన్న నూర్పిళ్లు చేస్తున్న రైతులు


పేరూరు వద్ద రోడ్డుపై ఆరబోసిన జొన్నలను పరిశీలిస్తున్న ఏఓ

వచ్చిన దిగుబడులను కళ్లాలు, రోడ్లపై ఆరబెట్టి విక్రయిస్తున్నారు. వాటిని మండల వ్యవసాయాధికారి జ్యోతి పరిశీలించి వచ్చిన దిగుబడులు, ధరలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. జొన్నలు నాణ్యతగా ఉండటంతో వ్యాపారులు ఒక్కో క్వింటా జొన్నలను రూ.3,500ల ప్రకారం కొనుగోలు చేస్తున్నారు. దీంతో పెట్టిన పెట్టుబడులు పోనూ లాభాలు వస్తుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### రూ.2.64 లక్షల ఆదాయం వచ్చింది



నాకున్న 6 ఎకరాల్లో ఆరెకరాల్లో తెల్ల జొన్న(బిస్కెట్ జొన్న), పదెకరాల్లో వరి సాగు చేశా. జొన్న పంటకు దాదాపు రూ.1.20 లక్షలు ఖర్చు చేశాను. కాస్త ముందస్తుగా జొన్న కోతలు కోయించగా ఎకరాకు 20 క్వింటాళ్ల ప్రకారం దిగుబడులు వచ్చాయి. అప్పట్లో క్వింటా జొన్న రూ.3,200లు ఉండటంతో అదే మంచి ధర అనుకొని అప్పుడే విక్రయించగా పెట్టుబడులు పోనూ రూ.2.64 లక్షల ఆదాయం మిగిలింది. చాలా సంతోషంగా ఉంది. త్వరలో వరి దిగుబడులు కూడా చేతికందుతాయి.

– మదార్, రైతు, చిన్నకంబలూరు

### మూడెకరాల్లో జొన్న సాగు చేశా



నాకున్న పదెకాల పొలంలో మూడెకరాల్లో జొన్న సాగు చేశా. సేద్యం, విత్తనం, భూమి మందులు, పిచికారీ ఖర్చులు కలుపుకొని రూ.55 వేలు ఖర్చు అయ్యింది. ప్రస్తుతం కోతలు కోయించగా మూడెకరాలు కలిపి 57 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఒక్కో క్వింటా రూ.3,400ల ప్రకారం విక్రయించగా రూ.1.94 లక్షలు రాగా పెట్టుబడులు పోనూ రూ.1.44 లక్షల ఆదాయం మిగిలింది. గతంలో కంటే ఈఏడాది మంచి దిగుబడులు, ధరలు అందడం సంతోషకరం.

– తిరుపతిరెడ్డి, రైతు, పేరూరు

## క్లుప్తంగా

### తక్కువ పెట్టుబడులతో అధిక లాభాలు


పొలంబడిలో పాల్గొన్న వ్యవసాయాధికారి, రైతులు

దొర్నిపాడు: వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ తక్కువ పెట్టుబడులతో అధిక సాధించాలని మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ సూచించారు. బుధవారం డబ్ల్యూ కొత్తపల్లె గ్రామ పొలాల్లో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. 250 ఎకరాలను ఎంపిక చేసి 110 మంది రైతులతో పాక్షిక సేంద్రియ సాగుకు శ్రీకారం చుట్టారు. ఇలా 14 వారాల పాటు ప్రతి బుధవారం పొలంబడి నిర్వహిస్తున్నట్లు వ్యవసాయాధికారి చెప్పారు. పొలం బడితో ప్రతి రైతును శాస్త్రవేత్తను చేయడమే లక్ష్యమన్నారు. పురుగు మందుల వినియోగం తగ్గించి, అవసరం ఉన్నంత మేరకే ఉపయోగించేలా రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రియ పద్ధతులు, ప్రకృతి వ్యవసాయం వల్ల పంటకు, నేలకు మేలు జరుగుతుందన్నారు. శత్రు, మిత్ర పురుగుల నిష్పత్తి, ఆకుల కత్తిరింపు ప్రయోగం చేయించారు. కార్యక్రమంలో వీఏఏ వంశీక్రిష్ణ ఉన్నారు.

### విధులు బహిష్కరించిన న్యాయవాదులు

నంద్యాల(వ్యవసాయం): డోన్ పట్టణానికి చెందిన న్యాయవాది పులి దామోదర్‌పై జరిగిన దాడికి నిరసనగా బుధవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు పెద్ది శ్రీనివాసులు, ముక్కెర కృష్ణారెడ్డిలు మాట్లాడుతూ న్యాయవాదిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు రామకృష్ణయ్య, శ్రీను, జగన్మోహన్‌రెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి పీర్ల జాతర

నంద్యాల(అర్బన్): పట్టణంలోని నూనెపల్లెలో వెలసిన హజరత్ సయ్యద్‌షా, ఉసేనాలం పీర్ల జాతర గురు, శుక్రవారాల్లో నిర్వహించనున్నట్లు ఉసేనాలం కమిటీ సభ్యులు, ఆహ్వాన పత్రాల దాత నవభారత్ హుస్సేన్ బుధవారం తెలిపారు. చివరి రోజు ఎడ్ల బండలాగుడు పోటీలు ఉంటాయని తెలిపారు.

### పంటల నమోదు పూర్తి చేయండి


పంటల నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏఓ

రుద్రవరం: పంటల నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారి జ్యోతి వీఏఏలను ఆదేశించారు. మండల పరిధిలోని పేరూరు, ఎర్రగుడిదిన్నె, మందలూరు గ్రామాల పరిధిలో సాగుతున్న పంటల నమోదు ప్రక్రియను బుధవారం ఆమె పరిశీలించారు. ఆర్‌బీకేల్లో ఎరువుల నిల్వలు, అమ్మకాలపై ఆరా తీశారు.

### నేడు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు రాక

ఆళ్లగడ్డ: మండల కేంద్రం చాగలమర్రికి గురువారం ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డిలు రానున్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా స్థానిక కేజీఎస్ ఫంక్షన్ హాల్లో సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ నాయకుడు కుమార్‌రెడ్డి బుధవారం తెలిపారు. సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

### చెడు వ్యసనాల జోలికెళ్లొద్దు


మాట్లాడుతున్న సీఐ నరసింహులు

నంద్యాల(సిటీ): చెడు వ్యసనాల జోలికెళ్లొద్దని మూడో పట్టణ సీఐ నరసింహులు విద్యార్థులకు సూచించారు. మాదక ద్రవ్యాల నిర్మూలన, మద్యపాన నిషేధం అంశంపై బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో సీఐ మాట్లాడారు. మాదక ద్రవ్యాలపై ఎటువంటి సమాచారం తెలిసినా 14500 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం సమన్వయకర్తలు గంగన్న, శ్రీనివాసులు, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### అమృత్ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి

నంద్యాల(సిటీ): తాగు నీటి సమస్య పరిష్కంచేందుకు చేపట్టిన అమృత్ పథకం పనులను మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని పట్టణ ప్రజలకు నీటి సమస్య ఏర్పడకుండా అమృత్ పనులను త్వరితగతిన పూర్తిచేయాల ని అధికారులను ఆదేశించారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వద్ద విద్యుత్ మోటార్ కనెక్షన్, పైప్ లైన్ పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు.కమిషనర్ వెంట ఇంజినీర్ రమణమూర్తి, డీఈఈ శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

### సాక్షిగణపతికి విశేషపూజలు


సాక్షిగణపతి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలావీరభద్రస్వామికి విశేషపూజలు నిర్వహించారు. సాక్షిగణపతి స్వామికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేష పుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. అలాగే జ్వాలావీరభద్రస్వామివారికి అభిషేకం, విశేషపుష్పార్చన జరిపించారు.

# ప్రతి గడపలో సంతోషం


సంక్షేమ పథకాల గురించి మహిళలకు వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

- నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి

నంద్యాల(రూరల్): జగన్న హయాంలో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉన్నారని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని కానాల గ్రామంలో ఎమ్మెల్యే శిల్పా రవి పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా.. అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందడంతో సామాన్య ప్రజలకు ఆర్థిక భరోసా, స్వయం ఉపాధి ద్వారా సుస్థిర జీవనానికి సానుకూల వాతావరణం ఏర్పడిందన్నారు. గత పాలకుల హామీలతో ప్రజలు మోసపోయారన్నారు. జగనన్న ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి మాట నిలబెట్టుకున్నారన్నారు. మరోసారి ఆయనను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో నంద్యాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ విజయశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు గోకుల్‌కృష్ణారెడ్డి, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, వైస్ ఎంపీపీ రంగారావు, ఎంపీటీసీ జమ్రుద్‌బీ, సర్పంచ్ దూదేకుల భావమ్మ, పార్టీ నాయకులు జగదీశ్వరరెడ్డి, దూదేకుల ఖాసీం, ఇస్మాయిల్, కార్యకర్తలు ఏ.గోపాల్, బాలఓబిలేస్ పాల్గొన్నారు.

# ప్రజలతో మమేకం కావాలి

- ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి

ఉయ్యాలవాడ: పార్టీ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు ప్రజలతో మమేకమై సంక్షేమ పథకాలను తెలియజేస్తూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సూచించారు. బుధవారం సాయంత్రం గోల్డెన్ ఫంక్షన్ హాల్‌లో మా నమ్మకం నీవే జగనన్న పేరుతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, గ్రామ, వార్డు వలంటీర్ వ్యవస్థలను ప్రవేశపెట్టి ప్రజల వద్దకే పాలన తీసుకువచ్చారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో, పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 98.4 శాతం నెరవేర్చారన్నారు. గ్రామ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి కుటుంబ యజమానితో మాట్లాడి వారి అనుమతితోనే స్టిక్కర్‌ను వాకిళ్లకు అతికించాలన్నారు. మన ప్రభుత్వం చేసిన మంచి పనులతో ముద్రించిన బుక్‌లెట్‌ను ప్రతిఒక్కరికీ అందజేయాలన్నారు. ఏవైనా సమస్యలున్నా నోట్ చేసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకులు బోరెడ్డి నరసింహారెడ్డి, మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, మండల బూత్ కమిటీ కన్వీనర్ పల్లె గురుప్రసాద్ రెడ్డి, మండల రైతు సలహా మండలి చైర్మన్ పోచా రాధాక్రిష్ణారెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గజ్జెల కృష్ణారెడ్డి, సర్పంచ్ మేకల ఓబులేస్, నాయకులు ఆరికట్ల శివరామక్రిష్ణారెడ్డి, లాలమ్మగారి హుసేనయ్య, తరిగోపుల ప్రసాద్‌రెడ్డి, దండే ఆదినారాయణరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు పల్లె మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి
- శిరివెళ్లలో మూడో రోజు గడప గడపకు మన ప్రభుత్వం
- పలువురు పార్టీలో చేరిక


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి

శిరివెళ్ల: పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం శిరివెళ్లలో 3వ రోజు పర్యటించారు. 4వ గ్రామ సచివాలయ పరిధిలోని 16, 17, 18 వార్డులు దేగలపేట, ఎస్సీ కాలనీలో ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. మూడున్నరేళ్లలో పొందిన సంక్షేమ లబ్ధిని ప్రజలకు వివరించారు. రాజకీయాలకు అతీతంగా, కుల, మతాలతో సంబంధం లేకుండా అర్హత ఉన్న ప్రతి పేదోడికి వలంటీర్ల ద్వారా పథకాలను చేరవేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కర్ణూరంపేటకు చెందిన కులుకు మస్తాన్ ఆధ్వర్యంలో 50 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో షేక్‌అస్లాం, మునాఫ్, జాకీర్, సన్నావుల్లా, మాలిక్, కరిముల్లా, మున్నావర్, కరీం, జబ్బీర్, ఆయూబ్, సలీం, తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బి.అబ్దుల్ సలాం, ఎంపీపీ నాయక్ వసీం, జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్‌నాయక్, హిస్టరీ అకాడమీ డైరెక్టర్ హఫీజ్, దొర్నిపాటి రఫీ, ముల్లా అన్వర్‌బాషా, ముడిమాల నాగరాజు, దేవస్థానం చైర్మన్ దాదిరెడ్డి తిమ్మరాయుడు, ఎంపీడీఓ సుబ్రమణ్యం, ఈఓఆర్డీ సాల్మన్‌రాజు, సర్పంచు సాలమ్మ, వీరారెడ్డిపల్లె సర్పంచ్ రాధిక, ఉప సర్పంచు ఇంతియాజ్, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఇందూరి ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

### ప్రజలను మభ్యపెట్టడానికే పాదయాత్ర

ఆళ్లగడ్డ: ప్రజలను మభ్యపెట్టడానికే నారా లోకేష్ పాదయాత్ర చేస్తున్నారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. బుధవారం చాగలమర్రిలో జరిగిన ఓ వివాహానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. లోకేష్ పాదయాత్ర వల్ల టీడీపీకి, ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. యువగళం పేరుతో అబద్ధాలు చెబుతున్నా ప్రజల నుంచి ఎలాంటి స్పందన రావడంలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజల ఆశీస్సులతో వైఎస్సార్‌సీపీ మరోసారి అధికారంలోకి వస్తుందన్నారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ సెల ప్రధాన కార్యదర్శి షేక్‌బాబులాల్, మండల కన్వీనర్ కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# గిరిజన సమస్యలు పరిష్కరించాలి


కమిటీ చైర్మన్ రవిబాబుకు వినతిపత్రం అందిస్తున్న గిరిజన సంఘాల నాయకులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని కొమరంభీం చెంచుగిరిజన సంఘం గౌరవాధ్యక్షుడు వై.ఆశీర్వాదం, నాయకులు కుడుముల వెంకటేశ్వర్లు, ధర్మా నాయక్, గోపాల్ నాయక్ బుధవారం ఏపీజెన్‌కో గెస్ట్‌హౌస్‌లో రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంబ రవిబాబుకు వినతిపత్రం అందించారు. మాణిక్యమ్మసెల, చెంచుగూడెంలో నివాసం ఉంటున్న గిరిజనులకు అటవీ భూహక్కుల చట్టం కింద ఇళ్లపట్టాలను మంజూరు చేసి గృహాలు నిర్మించి ఇవ్వాలని కోరారు. శ్రీశైల దేవస్థానం, అటవీశాఖల్లో పనిచేస్తున్న గిరిజన తాత్కాలిక ఉద్యోగులను వివిధ కారణాలతో కొంత మందిని తొలగించారని, వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

# హోరాహోరీగా బండలాగుడు పోటీలు

మద్దికెర: శ్రీ మద్దమాంబ రథోత్సవం సందర్భంగా మద్దికెరలో బుధవారం రాష్ట్రస్థాయి వృషభాల రాతి దూలం లాగే పోటీలను ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రారంభించారు. పోటీల్లో 11 జతలు ఎద్దులు పాల్గొన్నాయి. వైఎస్సార్ కడప జిల్లా కీర్తిపేట గ్రామానికి చెందిన వృషభాలు మొదటి బహుమతి రూ.50,116, కొత్తకోట బీఎస్ఎస్ రెడ్డి, నంద్యాల జిల్లా ఎస్.కొత్తూరు వృషభాలు రెండవ బహుమతి రూ.40 వేలు, నంద్యాల జిల్లా శివరాంరెడ్డి, కడప జిల్లా బీ.చెర్లోపల్లెకు చెందిన వృషభాలు మూడవ బహుమతి రూ.30 వేలు, అనంతపురం జిల్లా కృష్ణాపురం నాగేశ్వరరెడ్డి వృషభాలు నాల్గవ బహుమతి రూ.20 వేలు, అనంతపురం జిల్లా సోమలదొడ్డి రామసుబ్బారెడ్డి వృషభాలు ఐదవ బహుమతి రూ.10 వేలు, కృష్ణాపురం బాపవగౌడ్ వృషభాలు ఆరవ బహుమతి రూ.6 వేలు గెలుచుకున్నాయి. మద్దికెర శివారు గుంతకల్లు రహదారిలో ఉన్న మైదానంలో నిర్వహించిన పోటీలు ఉదయం నుంచి ఉత్కంఠ భరితంగా సాగాయి. కార్యక్రమంలో నాయులు నాగేంద్ర, ఎంపీపీ డీఎస్ అనితాయాదవ్, జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, సర్పంచ్ బండారు సుహాసిని, ఐడీసీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. పోటీలను తిలకించేందుకు వచ్చిన వారికి గ్రామానికి చెందిన నాగేష్, తిరుపతి రావు అన్నదానం చేశారు.

## గట్టెక్కిన శనగ రైతు


క్రిష్టిపాడులో తాను పండించిన తెల్ల శనగలను ఆనందగా చూపుతున్న రైతు

దొర్నిపాడు: మూడేళ్ల నుంచి శనగ రైతులకు ఆశించిన దిగుబడులు దరి చేరలేదు. ఈసారి మాత్రం కాస్త ఊరట నిచ్చింది. రబీలో సాగుఇ చేసిన జేజీ-11(ఎరుపు), కాబూలి(తెలుపు) రకం శనగ ఆశించిన స్థాయిలో దిగుబడులను ఇచ్చిందని రైతులు పేర్కొంటున్నారు. మొదట పంటకు అక్కడక్కడా తెగుళ్లు సోకినా వాటిని అధిగమించడంతో దిగుబడులు బాగా వచ్చాయి. ఎర్ర శనగ ఎకరాకు 7 నుంచి 8 క్వింటాళ్లు, తెల్ల శనగ 6 నుంచి 8 క్వింటాళ్ల వరకు దిగుడులు వచ్చాయి. ప్రస్తుతం ఎర్ర శనగ మార్కెట్లో క్వింటాకు రూ.4,600 ఉండగా తెల్ల శనగ రూ.6,500పైగా ఉంది. తెల్ల శనగ(కాబూలి)కు మాత్రం ఎర్ర శనగకంటే మార్కెట్లో రూ.2,000 అదనంగా ఉందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సుమారు 7,200 హెక్టార్లలో శనగ సాగు చేశారు. తెల్ల శనగ ధర హెచ్చుగా ఉండటంతో పాటు తెగుళ్లను తట్టుకుంటుందని రైతులు ఈసారి 4,000 హెక్టార్లలో ఉన్నదూ లేని విధంగా సాగు చేశారు. ఎర్ర శనగ(జేజీ-11)రకాన్ని 3,200 హెక్టార్లకు పరిమితం చేశారు.

### ప్రభుత్వ జీత భత్యాలకు చట్టబద్ధత కల్పించాలి

నంద్యాల(అర్బన్):ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, అవుట్ సోర్స్ ఉద్యోగులకు ప్రతి నెలా 1వ తారీఖున జీతాలు ఇచ్చేలా చట్ట బద్ధత కల్పించాలని ఏపీజీఈఏ (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం) జిల్లా అధ్యక్షులు నరసింహులు కోరారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఉద్యోగుల బకాయిలు, చెల్లింపులు, చట్టబద్ధత అంశంపై చర్చా వేదికను నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, మోహన్‌రావు, రష్మిక, రామచంద్రారెడ్డి, గోపాల్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### మహానందికి నేడు ఎస్టీ కమిషన్ చైర్మన్ రాక

మహానంది: ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభ రవిబాబు గురువారం మహానందికి వస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ శుక్రవారం మహానందీశ్వరస్వామిని దర్శించుకుంటారన్నారు. చైర్మన్‌తో పాటు ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యాశంకర్ నాయక్ వస్తారన్నారు. దర్శనం అనంతరం మహానందిలోని గిరిజనులతో ముఖాముఖి నిర్వహిస్తారని, సమస్యలపై మాట్లాడతారని చెప్పారు.

### ట్రాక్టర్ అపహరణ

మిడుతూరు: ఏపీ 39ఎన్ఎం8422 నంబరు గల ట్రాక్టర్, ట్రాలీ అపహరణకు గురైనట్లు ఎస్ఐ మారుతీశంకర్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలు.. మిడుతూరు గ్రామానికి చెందిన రైతు మానికింది వెంకటరమణ వ్యవసాయ పనుల నిమిత్తం ఇటీవల ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. ప్రతి రోజూ వ్యవసాయ పనులు ముగించుకుని ట్రాక్టర్‌ను నంద్యాల- నందికొట్కూరు రోడ్డును ఆనుకుని ఉన్న కల్లం దొడ్డిలో ఉంచేవాడు. అయితే మంగళవారం గుర్తుతెలియని వ్యక్తులు ట్రాక్టర్‌ను అపహరించారు. దీంతో ట్రాక్టర్ యజమాని వెంకటరమణ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు. ట్రాక్టర్ ట్రాలీ నంబర్ ఏపీ 39ఎన్‌క్యూ7396గా నమోదు చేయబడిందని వెల్లడించారు. ట్రాక్టర్ ఆచూకీ తెలిస్తే వెంటనే మిడుతూరు ఎస్ఐ 9121101189 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

### నేటి నుంచి నాగలూటిలో అన్నదానం

ఆత్మకూరు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీశైలక్షేత్రానికి కాలినడకన వెళ్లే శివస్వాములు, భక్తుల కోసం గురువారం నుంచి ఈ నెల 18వ తేదీ వరకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు విష్ణువర్ధన్‌రెడ్డి బుధవారం తెలిపారు. శ్రీశైల క్షేత్రానికి తరలివెళ్లే భక్తులు అన్నప్రసాదాన్ని సద్వినియోగం చేసుకోవాలని, శ్రీ భ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఆశీర్వాదం పొందాలని కోరారు.